క్లుప్తంగా

నేడు హనుమాన్ బైక్ ర్యాలీ

కడప కల్చరల్ : కడప నగరంలో ఆదివారం హనుమాన్ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. సాయంత్రం 4.00 గంటలకు స్థానిక మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయం వద్ద నుంచి స్థానిక యువకులతో బైక్ ర్యాలీ ప్రారంభం కానుంది. నగరంలోని అప్సర సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, ఎర్రముక్కపల్లె, మరియాపురం మీదుగా నగరంలో ప్రవేశించి పాత బస్టాండు వద్దగల శ్రీ గాలిదేవర ఆంజనేయస్వామి ఆలయం వద్ద ర్యాలీ ముగియనుంది. అక్కడ పూజలనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించనున్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు టెన్త్ ఉత్తీర్ణులై లేదా ఇంటర్మీడియేట్, డిగ్రీ, డిప్లొమా పాస్/ఫెయిల్ అయి ఉండాలన్నారు. అలాగే 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని, 35 రోజులపాటు శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. వివరాలకు 90004 87423నెంబరులో సంప్రదించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



పూజలు నిర్వహిస్తున్న సినీ బృందం, ఇతర సంస్థల ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్/ వల్లూరు : చైత్ర పౌర్ణమి సందర్భంగా శనివారం 26వ గిరి ప్రదక్షిణ శ్రీ పుష్పగిరి తీర్థక్షేత్ర ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీ పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సట్టి భారవి ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తమిళ యువ హీరో హమరేష్, నిర్మాత సతీష్ కుమార్, శ్రీ శివభక్తేంద్ర స్వామి దేవాలయ వ్యవస్థాపకులు, నిర్మాత బాబు రెడ్డి స్వామి, గానుగపెంట హనుమంత రావు, టూరిజం సలహాదారులు వెల్లాల వెంకటేశ్వరచారి కార్యక్రమంలో పాల్గొన్నారు. బాబురెడ్డి మాట్లాడుతూ పుష్పగిరిలో త్వరలో కొన్ని సన్నివేశాలు షూట్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరి ప్రదక్షిణకు సహకరించిన దాతలు చెంగా రామయ్య, జంబాపురం ఓబుల్ రెడ్డి, రాయనిచెన్నారాయుడు, రామయ్య చిట్స్ నిర్వాహకులు, సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



ఆలయం చుట్టూ కలశాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున పుణ్యనదీ జలాలతో నింపిన తొమ్మిది కలశాలను ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్, వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు ఆలయం చుట్టూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. మంగళ వాయిద్యాల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో తొమ్మిది మంది దంపతులు ఇతర భక్తులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి మూలమూర్తికి కలశాలలోని పవిత్ర జలంతో ప్రత్యేకంగా నవకలశ స్నపనం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. అమ్మవారిని కనుల పండువగా అలంకరించారు. ఉదయం యాగశాలలో చండీహోమం నిర్వహించారు. సాయంత్రం 108 మంది ముత్తయిదువులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 108 దీపాలను వెలిగించి అష్టోత్తర శతదీపాలంకార సేవ నిర్వహించారు. రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు.

15 నుంచి ఉద్యమ బాట



మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగరం 15వ డివిజన్ సరోజినీ నగర్ దగ్గర ఉన్న ఆచార్య కాలనీలో మౌలిక సమస్యలు కల్పించాలని కోరుతూ, అలాగే బోగస్ పట్టాలపై సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి ఉద్యమ కార్యచరణ చేపడుతున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి ఏ రామ్మోహన్ తెలిపారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కడప నగరంలో 15వ డివిజన్లో ఉన్న ఆచార్య కాలనీ దాదాపు 30 సంవత్సరాల కిందట ఏర్పాటు అయిందని, ఇప్పటికి కూడా అక్కడ మౌలిక వసతులు, రోడ్లు డ్రైనేజీ మంచినీటి సమస్య పరిష్కరించడంలో పాలకులు, అధికార యంత్రాంగం విఫలం చెందారని అన్నారు. ఇంటి పట్టాలు, ఇళ్ల స్థలాలు దళారుల చేతిలో వున్నాయని, భూకబ్జాదారులు యథేచ్ఛగా అమ్ముకుంటున్నారన్నారు. తహసీల్దార్ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, పాల్గొన్నారు.



రామయ్యకు పుష్పయాగం

కడప కల్చరల్ : కల్యాణం అనంతరం భక్తులు శ్రీ సీతారాములను పుష్పాలతో అర్చించారు. ఉగాది నుంచి ప్రారంభమైన వసంత నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో పుష్పయాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ ధర్మకర్త దేసు వెంకటరెడ్డి పర్యవేక్షణలో భక్తులు దాదాపు 50 కిలోలు, పది రకాల పూలతో స్వామి, అమ్మవార్లను అభిషేకించారు. ఉత్సవ మూర్తులు శ్రీ సీతారాములతోపాటు లక్ష్మణ స్వామిని కూడా విశేష అభిషేకాలనంతరం ప్రత్యేకంగా అలంకరించి ఉన్నత పీఠంపై కొలువుదీర్చారు. భక్తులు తెచ్చిన రంగురంగుల పూలను అభిషేకానికి వినియోగించారు. అర్చకుల మంత్రోచ్చాటనలు, మంగళ వాయిద్యాల మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక్కొక్క రాగం ఆలపించి దానికి సంబంధించిన పూలను స్వామికి సమర్పించారు. దాదాపు గంటపాటు సుస్వరాలు, రంగురంగుల పూల మధ్య ఈ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులందరికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

దేశ సమైక్యతకు తూట్లు



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

- వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి
- కడప ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఐ నిరసన

కడప కోటిరెడ్డి సర్కిల్ : దేశ సమైక్యతకు, మత స్వేచ్ఛకు తూట్లు పొడుస్తూ అర్ధరాత్రి తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణలను ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. రాజ్యాంగ వ్యతిరేక వక్ఫ్ చట్ట సవరణలను నిరసిస్తూ శనివారం సీపీఐ దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా కడప ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా పార్లమెంటులో అర్ధరాత్రి బిల్లును ఆమోదింపచేసుకున్నారన్నారు. దేశంలో మైనారిటీలు ముఖ్యంగా ముస్లింలను లక్ష్యంగా చేసుకున్న బీజేపీ దేశాన్ని మతం పేరిట విభజించేందుకు స్పష్టమైన ప్రయత్నం చేస్తున్నదన్నారు. ఇక చర్చి, క్రైస్తవ మైనారిటీల వ్యవస్థలు, ఆస్తులను లక్ష్యంగా చేసుకున్నా ఆశ్చర్యం లేదన్నారు. బీజేపీ మోదీ ప్రభుత్వ పద్ధతి చాలా ప్రమాదకరంగా మారిందన్నారు. వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కేవలం నల్ల స్ట్రిప్పులతో నిరసన తెలిపినందుకు మూడు వందల మంది ముస్లింలకు యూపీ ప్రభుత్వం నోటీసులు ఇచ్చిందని, కడపలో సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టినందుకు కేసులు పెట్టి జాకీర్ హుస్సేన్‌ను జైలుకు పంపారని, ఇవన్నీ మైనారిటీలను భయపెట్టడానికి కాకపోతే మరెందుకన్నారు. కూటమి ప్రభుత్వ, టీడీపీ, జనసేన ఎంపీలు ఉభయ సభల్లోనూ వక్ఫ్ సవరణల బిల్లుకు మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు యల్. నాగ సుబ్బారెడ్డి, ఎంవీ సుబ్బా రెడ్డి, నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా, ఇన్సాఫ్ నాయకులు గౌస్, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు సావంత్ సుధాకర్ , మనోహర్ రెడ్డి, బ్రాహ్మం, మల్లికార్జున, మునెయ్య, లింగన్న, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయా....ఆశీర్వదించవయా..



మారుతినగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కడప కల్చరల్: ఆంజనేయా...ఆశీర్వదించవయా.... అంటూ భక్తులు పెద్ద ఎత్తున హనుమంతుడికి పూజలు నిర్వహించారు. శనివారం హనుమద్ విజయం పవిత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా హనుమంతుని ఆలయాలలో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 5.00 గంటల నుంచే హనుమన్న ఆలయాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. పలువురు భక్తులు మొక్కులు తీర్చుకోవడంలో భాగంగా స్వామి మూల విరాట్‌కు ఆకుపూజ, వడమాల సేవ నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామికి పంచామృతాభిషేకం, సింధూర అభిషేకాలు నిర్వహించారు. స్వామికి విశేష అలంకారం చేసి భక్తులను దర్శనాలకు అనుమతించారు. భక్తులు సామూహికంగా భజనలు, భక్తిగీతాలాపనలు చేశారు.

- కడప నగరం మారుతినగర్‌లోగల ఆలయంతోపాటు బ్రాహ్మణవీధి, రాజేశ్వరీ ఆలయ ప్రాంగణం, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు.

- కడప నగరంలోని గాలిదేవర ఆంజనేయ స్వామి ఆలయంలో కూడా విశేష పూజలు చేపట్టారు. ఆంజనేయుడికి ప్రత్యేక అలంకారం చేశారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ



హర్షిణి



అర్షియాఖాన్

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో కడప ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ప్రథమ సంవత్సరం సీఈసీ, హెచ్ఈసీ, ఎంపీసీ, బైపీసీలో 31 శాతం ఉత్తీర్ణత, ద్వితీయ సంవత్సరం సీఈసీ, హెచ్ఈసీ, ఎంపీసీ, బైపీసీలో 52 శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అబుబుల్లా తెలిపారు. ఇందులో సెకండియర్ బైపీసీకి చెందిన అర్షియాఖాన్‌కు 1000కి గాను 932 మార్కులు సాధించగా, ప్రథమ సంవత్సర బైపీసీ విద్యార్థి హర్షిణి 440 మార్కులకు గాను 405 మార్కులు సాధించిందని తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

పార్టీ ఇచ్చిన బాధ్యతను అంకిత భావంతో నిర్వర్తిస్తా

- వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి. సంజీవయ్య



కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తనకు ఇచ్చిన బాధ్యతను అంకిత భావంతో నిర్వర్తిస్తానని మేధావుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కం సంజీవయ్య తెలిపారు. తనపై నమ్మకంతో ఈ విశిష్టమైన అవకాశాన్ని కలిపించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మేధావుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై. ఈశ్వర ప్రసాద రెడ్డి, కడప జిల్లా అధ్యక్షులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, కడప ఎంపీ అవినాష్ రెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

మీడియాను అణచివేయాలనుకోవడం అవివేకం

కడప రూరల్: సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న మీడియాను అణచివేయాలనుకోవడం అవివేకమని ది కడప టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పీ ఖాదర్‌బాష అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలకులతో పాటు మరెవరైనా గాని జర్నలిజంపై జులుం ప్రదర్శించాలనుకోవడం ఎంత మాత్రం తగదన్నారు. మీడియా సమాజంలోని మంచి, చెడులను వెలుగులోకి తెస్తోందన్నారు. అలాంటి జర్నలిజంపైన అందులో పనిచేసే జర్నలిస్టుల మీద తప్పుడు కేసులు బనాయించడం తగదన్నారు. కార్యక్రమంలో ఖదీర్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత అన్నదానానికి రూ.5 లక్షల విరాళం

వేంపల్లి : శ్రీశ్రీ గౌరిదేవి బలిజ సంఘం శాశ్వత అన్నదానానికి నామా నారమ్మ, నామా చిన్నయ్య దంపతుల కుమారుడు నామా నిత్యానంద్(ఎన్ఆర్ఐ) విరాళం అందజేసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు నంబూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్‌లు పేర్కొన్నారు. శనివారం గౌరిదేవి ఆలయంలో దాత రూ.5,16,116ల నగదును అందజేశారు. అనంతరం కుళాయప్ప, చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆ నగదు రాబడిని ప్రతి ఏడాది కార్తీక మాసం శ్రీగౌరీదేవి పండుగ పూర్తయిన తర్వాత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే దాతను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు ప్రసాద్‌శర్మ, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి వేడుకలు

వీరపునాయునిపల్లె : వేంపల్లె, ఎర్రగుంట్ల ప్రధాన రహదారిలోని ఎస్.పాలగిని క్రాస్ వద్ద వెలసిన కాశిరెడ్డినాయన ఆలయం, సంగాలపల్లెలో వెలసిన గోశాలలో శనివారం ఘనంగా పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి కాశినాయన ఆలయంలోని మూల మూర్తితో పాటు ఉత్సవ మూర్తికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. గోశాలలోని గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ప్రాంగణంలోని కృష్ణాలయంలో భాగవత పఠనం, గీతా పారాయణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయాల నిర్వాహకులు అన్నదానం కల్పించారు. మండలంలోని పలు ఆలయాలలో కూడా పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయాలలోని మూలమూర్తులను సుందరంగా అలంకరించారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం



కడప నగరంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కడప అర్బన్: జిల్లా వ్యాప్తంగా శనివారం రోడ్డు భద్రతపై పోలీసు అధికారులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. రోడ్డు భద్రతపై వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ హెల్మెట్‌లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, మద్యం సేవించి వాహనం నడపడం, సీటు బెల్టు ఉపయోగించకపోవడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయన్నారు. విద్యార్థులు రోడ్ క్రాస్ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మైనర్‌లకు వాహనం ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. వాహనం నడిపేటప్పుడు వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్ పత్రాలు, లైసెన్స్‌లను చోదకులు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని అన్నారు. పౌరులందరూ రోడ్డు భద్రతా నియమాలకు కట్టుబడినప్పుడే ప్రమాదాలు అరికట్టవచ్చన్నారు. ఆటో, టాక్సీ డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, యూనిఫామ్ ధరించాలని, క్రమశిక్షణతో వాహనం నడపాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లకూడదని తెలిపారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపడం వల్లనే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు మానసిక, శారీరక ఏకాగ్రత ఎంతో అవసర మన్నారు. ఇతర ఆలోచనలతో, అతి వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు.

నైతిక విలువలు జీవితంలో భాగం కావాలి



బెస్ట్ వాలంటీర్లుగా బహుమతులు అందుకున్న వారితో వైవీయూ సిబ్బంది, మానవత ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్: క్రమ శిక్షణ, నైతిక విలువలు ప్రతి విద్యార్థి జీవితంలో భాగం కావాలని తద్వారా ఉన్నత స్థితికి చేరుతారని యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ డా . ఎస్. వెంకట్రామిరెడ్డి అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, వైవీయూ జాతీయ సేవా పథకం విభాగం -9 ఆధ్వర్యంలో శనివారం యోగివేమన విశ్వ విద్యాలయంలో ×విద్యార్థులు - నైతిక విలువల్లు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి , మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్. అవటాల. రామాంజనేయరెడ్డి , మానవతా సంస్థ సభ్యులు కె .గోపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బెస్ట్ వాలంటీర్లకు రూ.1000 నగదు బహుమతి , షీల్డ్, సర్టిఫికెట్ ప్రదానం చేశారు. వైవీయూ జాతీయ సేవా పథకం-9 విభాగ ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె. శ్రీనివాసరావు , ఎంసీఏ బీవోఎస్ ఛైర్మన్ డా. బి. రెడ్డయ్య పాల్గొన్నారు.

పోరుబాట సదస్సు జయప్రదం చేయండి



పోరుబాట కరపత్రాలను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: విద్యారంగ, ఉపాధ్యాయ ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం ఈనెల 13న కర్నూలులో జరిగే పోరుబాట సదస్సును జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి లక్ష్మిరాజ, ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు పిలుపునిచ్చారు. ఈ పోరుబాట కరపత్రాలను శనివారం కడప యుయుటీఎఫ్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి ఇంకా రూ. 25 వేల కోట్ల ఆర్థిక బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ ప్రభుత్వం ఆర్థిక బకాయిల చెల్లింపు కోసం రోడ్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ అరియర్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, కార్యదర్శులు సివి రమణ, ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు డి. సుబ్బారావు, రామకేశవ, నాయకులు ఎస్ఎం భాష తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి



విద్యార్థికి బహుమతిని ప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ పొచంరెడ్డి సుబ్బారెడ్డి

కడప ఎడ్యుకేషన్: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు క్రమశిక్షణతోపాటు విలువలతో కూడిన విద్యనందించాలని మాజీ ఎమ్మెల్సీ పొచంరెడ్డి సుబ్బారెడ్డి సూచించారు. కడప శంకరాపురంలో శ్రీశాంతినికేతన్ స్కూల్ వార్షికోత్సవాన్ని కరస్పాండెంట్ ఎస్. ఎలియాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ పొచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో చదువుతోపాటు మానవతా విలువలు చాలా అవసరం అన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దానిని అందుకునేందుకు గట్టిగా ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. తదనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.